కథలు :

# చీకటిపులి

జయంతి

వేసవి ఎండ మండిపోతోంది. ఎర్రధూళి పొగలా లేచి వూర్ని కప్పేస్తోంది. ఆ గుడిసెఇళ్లు కాలేసినట్లు గుబులుగుబులుగా వున్నాయ్. ఆ గుడిసెల్లోనివాళ్లు చెమటతో తడిసి ముద్దయిపోతున్నారు. అంచాత వాళ్లు ఇళ్లు వదిలి రామకోవెలముందు వేపచెట్ల కింద చేరిపోయారు.

రావుడుతాత వేపచెట్టుకిందనున్న రాతిపలకమీద చెట్టుమొదలకు నడుం ఆన్చి కూర్చున్నాడు. సగం కాల్చివుంచిన చుట్టను తలపాగాలోంచి మళ్లీ తీసి ముట్టించాడు.

వయసుమళ్లిన కొందరు ఆ గుడి అరుగులమీద నిద్రపోతున్నారు. కొందరు కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు, ఇళ్ళ ముంజూర్లకింద కూర్చుని కొందరాడాళ్లు పేలు నొక్కుకుంటూ వూసులాడుకుంటున్నారు. కొందరు వయసులోని కుర్రాళ్లు వయసులోవున్న ఆడపిల్లల్తో ఎకసెక్కేలాడుతున్నారు. గుడివెనక కొందరు కుర్రాళ్లు గోళీలాడుతున్నారు.

ఆ గుడికి ఎదురుగా, కొంచెం పక్కగా సుబ్బారావు మేడవుంది. ఆ మేడ దూరంనుండిచూస్తే, కిరీటంవున్న మహారాజులా కనబడుతుంది. దగ్గర్నుంచి చూస్తే ఆ మేడ అందరికీ ఒకలా కనబడదు. కొందరికి చీకటి గుహలా, క్రూరంగా, భయంకరంగా, అసహ్యంగా కనబడుతుంది. కొందరికి దేవేంద్రభవనంలా కనబడుతుంది.

ఆ మేడచుట్టూ దోపిడీకీ—శ్రమకూ మధ్య గీతలా ప్రహరీ గోడ వుంది. ఆ గోడచుట్టూ మామిడిచెట్లువున్నాయి. ఆ చెట్లకింద చిక్కని నీడలున్నాయి. ఆ నీడల్లో సుబ్బారావు మనవడు పదేళ్ల గిరిజారావు మూడు చక్రాల సైకిలుమీద ఖుషీగా కూర్చున్నాడు. రావుడుతాత మనవడు రామారావు వుషారుగా సైకిలు తోస్తున్నాడు. గిరిజారావు సైకిలుమీద తిరుగుతూ సంతోషంతో తలతిప్పుతున్నప్పుడు, గాలికి కదుల్తున్న (అతి)పెద్ద రబ్బరుబొమ్మలా వున్నాడు.

అప్పుడే సుబ్బారావు కార్లో ఇంటిముందు దిగాడు. ఆ కారు షెడ్లోకిపోయింది, సుబ్బారావు మేడమీదకు వెళ్లాడు.

అప్పటికొక గంటముందే అతడు ఒక సభలో వుపన్యసించాడు. అతడు బీద ప్రజలనుద్దేశించి ఆ సభలో మాటాడేడు.

"నా స్నేహితుల్లారా, బీదల్లారా! నా మిత్రుల్లారా, కడుపేదల్లారా! మీకష్టాలు చూసి నా కళ్లు నీళ్లుకారుస్తున్నాయ్. మీ బాధలుచూసి నా గుండె చెరువైపోతోంది. మీ కష్టాలు పోవాలంటే, మీరు కష్టపడి పనిచేసి దేశసంపదను పెంచాలి. దేశసంపద పెరిగితే, మీ కష్టాలు పోతాయి. అంతేకాదు, కూడు లేకపోయినా మీకు కల్లు వుండాలి. గంజి లేకపోయినా, మీకు పక్కలో ఆడదుండాలి. ఇలాంటి వ్యసనాలవల్లే మీకు దరిద్రం, ఈ వ్యసనాలవల్లే మీకు కష్టాలు. వీటివల్లే మీకు బాధలు. కష్టపడి పనిచేసి, వ్యసనాలు విడిచేస్తే మీకు దరిద్రంవుండదు. కష్టాలుండవు. బాధలుండవు" అని అతడు ఉపన్యసించే, అవేళప్పుడు కార్లో ఇల్లు చేరుకున్నాడు.

ఆ సుబ్బారావు పదిహేనేళ్లు వొచ్చేవరకూ రావుడితోకలిసి పక్కూరి నాయుడిగారి పశువుల్నికాసాడు. పదిహేనేళ్ళసుబ్బికి వాళ్ళపట్నం మాఁవొచ్చి ఏదో వుపదేశంచేసాడు. ఏం వుపదేశించాడో తెలీదుకాని, తర్వాత వారంరోజుల్లో బస్తీకిపోయి సారాకొట్లో పని సంపాదించాడు. ఇరవై ఏళ్ళ సుబ్బు తన వూరు తిరిగొచ్చి, ఆ వూళ్లో సొంతంగా సారాకొట్టు పెట్టాడు. ఆ సారాకొట్టుముందు టీకొట్టుకూడా పెట్టాడు. ఆ సారాకొట్లో (తను కొట్టుకొచ్చిన) సరసాలాడగల చిన్నదాన్ని పెట్టాడు.

ఆ సిన్నది అతనికంటే పెద్దది. ఆమె ఇదివరకు బస్తీసారాకొట్లో పన్జేసి నేర్పు సంపాదించింది. ఆమెపేరు 'లచ్మి'అయినా ఆమె ఊర్వశిలా మగాళ్ళను వుర్రూతలూగించగలదు. ఆమెచేత్తో సారాఇస్తే ఒకగ్లాసుడు తాగేవాడు, మూడుగ్లాసులు తాగ్గలడు.

అలా కొంతకాలం గడిచింది. తర్వాత వోసారి అవూరు గారడీవాళ్లు వచ్చారు. ఆ వూరు వచ్చిన గారడీవాళ్లు ఆ సారాకొట్లోకికూడా వచ్చారు. ఆ గడసానిఫీట్సుచేస్తూ బాణంలా వెనక్కి వొంగినప్పుడు సుబ్బి కళ్లు చెదిరిపోయాయి. మగాళ్ళలోని పశువుకి ఆమె బలంగా మేత పెట్టగలదని అతడు వెంటనే గ్రహించాడు. వెనువెంటనే వెయ్యి రూపాయిలిచ్చి ఆమెను కొనేసాడు. ఆమెను కొన్నాక బస్తీలో యిల్లు కొన్నాడు. తర్వాత పదిమంది పదునైన ఆడాళ్ళను పట్టి ఆ గడసాని నాయకత్వంకింద సుఖాలు అమ్మించడం ప్రారంభించాడు. ఆ ఇంటిని విశ్రాంతి భవనంగా మార్చాడు.

అప్పుడతడు వడ్డీవ్యాపారంకూడా ప్రారంభించాడు.

పాతికేళ్ళ సుబ్బి అప్పులపాలయిపోయిన రావుడితాత మూడెకరాల గరువూ దక్కించుకున్నాడు. ముప్పైఏళ్ల సుబ్బి ముప్పయి ఎకరాల గరువుకొన్నాడు, నలబై ఏళ్ళ సుబ్బారావు ఏభై ఎకరాల పొలం కొన్నాడు. ఏభై ఏళ్ళ సుబ్బారావు సొంతవూళ్లో పెద్ద మేడ కట్టించాడు.

అతడలా ధనవంతుడవగానే ఎన్నికలపార్టీలన్నీ అతణ్ణి చుట్టుముట్టాయి. ప్రతి పార్టీ అతణ్ణి చేరతీసుకోడానికి ప్రయత్నించింది. అయితే అతడు ఏ రాజకీయపక్షం వల్ల తనకు లాభంవుంటుందో, ఆ పార్టీలో చేరిపోయాడు.

చిన్నతరగతి ప్రజానాయకుడుగా మారిపోయిన సుబ్బారావు అహింసను ప్రజలకు బోధిస్తాడు. శాంతియుత పరిష్కారాలు ఉద్బోధిస్తాడు.

అయితే రావుడితాత జీవితం వేరు.

అతడు ఇరవై ఏళ్ళవరకూ వక్కూరి నాయుడిగారి పశువుల్ని కాసాడు. ఇరవై ఏళ్ళ రావుడు తండ్రిమిగిల్చిన కొండదిగువ పర్రభూమిని సాగులోకి తేడానికి ప్రారంభించాడు. ఆ భూమి మూడెకరాలుంటుంది. కొంత భూమి బండరాళ్లతో నిండి వుంది. కొండమీంచిదొర్లిన వర్షంనీరు ఆ బండరాళ్లమధ్య కాలువలుకట్టి పారుతోంది. ఆపక్కనే వున్న చిట్టడవి ఆ భూమిలో కొంతవరకూ వ్యాపించివుంది.

ఆ భూమిలోని ఎండిపోయినచెట్లు ముసలిరాక్షసుల్లాగ భయంకరంగా వున్నాయి. బాగా బలిసి పచ్చగావున్నచెట్లు కత్తులూదూస్తున్న వనరాక్షసిలాగ క్రూరంగా వున్నాయి. గజిబిజిగా చిక్కగా అల్లుకున్న ముళ్లపొదలు, జుత్తులు విప్పుకుని కాళ్లుచాచుక్కూర్చున్న దెయ్యాల్లాగ భయంకరంగావున్నాయి. ఆ చిట్టడవి, చీకటి చీకటిగా, చిక్కులు చిక్కులుగావుంది. ఆ చిట్టడవిలో క్రూరమైన పాములున్నాయి. పుల్లు లేకపోయినా పులుల్లాటి ఎలుగుగొడ్లున్నాయి. చిరుతపుల్లు లేకపోయినా రేచుకుక్కల్లాటి తోడేళ్లున్నాయి.

అయినా రావుడు ఏవీ భయపడలేదు. జడిసిపోలేదు. అతని చేతులు గొడ్డళ్లై ఆ బండరాళ్ళను పిండిచేసాయి. అతని వూపిరి అగ్నిజ్వాలలై ఆ చెట్లనూ పొదలనూ కాల్చేసింది. అతని గోళ్లు తవ్వు గోళ్లై చెట్ల వేళ్ళను పీకేసాయి. అతని కళ్ళల్లో మంటల్నిచూసి ఆ ఎలుగుగొడ్లు పారిపోయాయి. అతని గుండెల్లో నిప్పుసుచూసి ఆ తోడేళ్లు బెదిరిపోయాయి. ఆ పాం(వులు అతని కాళ్ళకిందపడి నల్లుల్లా నలిగిచచ్చాయి. కొండమీంచి పారే నీటి ప్రవాహం అతడు తవ్విన పక్కకాలువలో గొల్లుమని ఏడుస్తూ పారుతోంది, అతని చెప(టతో ఆ భూమి తడిసిపోయి మెత్తబడి సాగులోకివచ్చింది.

అయితే ఆ యజ్ఞంలో రావుడికుటుంబం అంతా వొళ్లు మర్చి పన్జేస్తున్నప్పుడు రావుడి రెండేళ్ళకొడుకు పాముకుట్టి చొంగలుకక్కి చచ్చిపోయాడు.

అంతేకాదు ఆ భూమి సాగులోకి రాడానికి చాలాసంవత్సరాలు పట్టింది, రావుడే కాకుండా రావుడి కుటుంబంలోని అందరూకూడా ఆయజ్ఞంలోనేవుండిపోయారు రావుడి కొడుకు సిమ్మాద్రి రావుడితో సమానంగా పాటుపడ్డాడు. వాళ్ళ శ్రమ మరోనాటిబతుకు

తెరువుకి పెట్టుబడే అయింది. అంచేత మరో బతుకుతెరువులేక అప్పులుచేసి బతక వల్సివచ్చింది.

ఆ అప్పు ఎలా పెరుగుతుందో రావుడికి తెలీదు. ఆ భూమి సాగులోకివచ్చి పండడం ప్రారంభించిననాటికి అప్పులభారం పెరిగిపోయి పీక్కి వురితాడులా తగుల్కుంది అంచాత ఆ పండబోతున్న భూమిని అమ్మేసి, ఆ వురితాడు తప్పించుకున్నాడు అప్పు డతడు సుబ్బారావు పెదపాలికాపుగా మారిపోయాడు.

రావుడుతాత మావిఁడిచెట్లకింద సైకిలు తోస్తున్న మనవణ్ని చూస్తున్నాడు.

మనవణ్ని చూస్తున్న రావుడుతాత తన గతాన్ని తల్చుకుని విచారిస్తున్నాడు. కొడుకు జీవితాన్ని తల్చుకుని కుమిలిపోతున్నాడు. మనవడి భవిష్యత్తు తల్చుకుని బాధ పడుతున్నాడు.

వేడిగాలి రివ్వున వీస్తోంది. ఎఱ్ఱధూళి గుప్పున లేస్తోంది. ఆకాశం ఎఱ్ఱగా మండిపోతోంది. భూమి నిప్పులా కాలిపోతోంది.

'నువ్వే సేసినావిదంతా, నువ్వే సేసినావిదంతా'అంటూ గాలిలా రివ్వున వచ్చి, వేడిగా మాటాడుతోంది రావుడిభార్య. ఆమె ఒకచేత్తో సత్తుగిన్నెతో గెంజిపట్టుకొచ్చి రావుడిముందుంచింది, రెండోచేయి విసురుతూ విసురుగా మాటాడుతోంది.

'ఈ సేత్తో నాకొడుక్కి గెంజోసి పదిపంట్లయిపోనాది. ఆ పొద్దూ నేడు— ఈ పొద్దూ నేదు ఆడు మల్లీ సూపవనేదు, ఆ గుంటడికి అల్లయ్యోదో తెల్దు, అణ్ని సూస్తా వుంటే నాకు కడుపులో అగ్గేసినట్టు మంట మంట. నీ రోసంముక్కలవా, ఇదంతా నువ్వే సేసినావు'అని ఆమె అక్కసు వెళ్ళబోస్తోంది.

'ఓలత్తా, ఒల్లకొయ్యే. మాఁవ బెంగడిసస్తన్నాదే, మావని పీక్కుతినేకే, నీ కొడుకు మా మంచోడంటే? ఒల్లకోవే, సిగ్గునేక, అంటూ కోడలు అత్తని రెండు చేతులూ పట్టుకుని ఇంటికి లాక్కుపోయింది.

రావుడు ఏదో చెప్దావని ప్రయత్నంచేసాడు. అతడి నోరు పెగల్లేదు. దుఃఖం గుండెల్లో గూడుకట్టుకుంది. దెయ్యంలా అతడి పీక నొక్కేసింది. పీక్కుపోయిన అతడికళ్లు నీళ్ళతో నిండాయి. ఆ కన్నీటిబిందువులు జారి గుండెలమీది చెవఁటబిందువుల్తో కలిసిపోతున్నాయి. ఆ కన్నీరు అతడికి ఏవీ కనబణ్ణేదు.

అసలు జరిగిందేవిటీ అంటే రావుడుతాత కొడుకు 'సిమ్మాద్రి'ఇల్లు విడిచి వెళ్ళి పోయి పదేళ్ళయిపోయింది. (అతడు తండ్రిచే కుక్కలా కొట్టబడి ఇల్లువిడిచివెళ్ళి పోయాడు.)

అవి కరువురోజులు. ఆనాడు రావుడియింట్లో తిండిగింజలు నిండుకున్నాయి. చేతిలో డబ్బులేదు. పిల్లలుకూడా పస్తులు పడిపోతున్నారు. అంచాత రావుడు చిన్ననాటి స్నేహితుడేకాకుండా, ఆనాటి యజమానైన సుబ్బారావు యింటికి వెళ్లి అతణ్ణి పిల్చాడు.

సుబ్బారావు మేడమీద పడకగదిలోంచి రావుడి పిలుపు విన్నాడు. 'అవును. ఇప్పుడు రావుడు నన్నెందుకు పిలుస్తాడు? వీళ్లెవరైనా ఈ కరువురోజుల్లో నన్నెందుకు పిలుస్తారు? డబ్బుకోసం— అప్పుకోసం. వీళ్లకిచ్చినడబ్బు మళ్ళీ తిరిగిరాదు'అని సుబ్బారావు అనుకున్నాడు. 'ఏదోచెప్పి రావుణ్ణి తగిలెయ్'అని భార్యతో చెప్పాడు.

ఆమె చకచకా మెట్లుదిగి వచ్చింది.

'రావుడూ. ఆయన నిద్రపోయారు. ఏంకావాలీ'అని అడిగింది.

'ఏంనేదమ్మా. బాబుగారు నాకు వరాలిచ్చే దేవుణ్ణాటోరు. కరువు మమ్మల్ని తినేస్తోంది. బిడ్డ సాత్రిగా ఇంటికాడ పిడికెడు గింజల్నేవు. సేతులో కానీ డబ్బుల్లేవు. మాం మిమ్మల్ని నమ్ముకు బతుకుతున్నాం. ఈ కరువు రోజుల్లో తవరు కూసింత మమ్మల్ని కాయాల'అని రావుడు వినయంగా విన్నవించాడు.

ఆమె చిరునవ్వు నవ్వుతూ ఆ మాటలు వింది. 'నువ్వెందుకొచ్చావో మాకు తెలీదేంటి'(అని ఆమె మనసులో అనుకుంది. అలా)అనుకుని 'రావుడూ, నిజంవే. వెధవముండా కరువు మండిపోతోంది. ఈ కరువు ఇంతవేగంగాపోదు. ఏదో ప్రళయం వొచ్చేసి ముంచేసేవరకూ ఈ కరువు పోదనినా నమ్మకం. నీకు రావాల్సిన సంవత్సరజీతం మొదటినెల్లోనే కొల్చివేసాంకదా! అంచాత నువు మళ్ళీ యిలా అడగడం ఏవీ బాగోలేదు. నీలాంటి వాళ్ళకి అప్పుయిస్తే మళ్ళీ తిరిగిరావడం చాలా కష్టమని మాకు బాగా తెల్సు. మాకుకూడా డబ్బు ఒత్తినేరాలేదుకదా! రాదుకదా! సుబ్బారావుగారు వరాలిచ్చే దేవుడయితే అవుగాక. కానీ దేవుడుకూడా ఎవళ్ళకీ ఒట్టినే వరాలివ్వడట. ఏవరాలిచ్చేదేవుడూ సంచుల్తో డబ్బుపట్టుకొచ్చి, మా గుమ్మంలో గుమ్మరించడు. ఈ పాడు డబ్బుకోసవే సుబ్బారావుగారు ఎన్నికష్టాలుపడ్డారో నీకు బాగా తెల్సు. అలా కష్టపడి సంపాదించుకున్న డబ్బు మేం దానాలుచేయలేం. తిరిగిరాని మదుపులు పెట్టలేం" అని చెప్పి ఆమె విసురుగా, కోపంగా వెళ్ళిపోయింది.

ఆమె వచ్చినప్పుడు చిరునవ్వు నవ్వుతూ వచ్చింది. ఆమె చిరునవ్వు పులి మందహాసంలావుంది. ఆమె వెళిపోయేటప్పుడు కోపంగా వెళిపోయింది. ఆమె కోపంగావున్నప్పుడు, అప్పుడే ఈనిన అతిసుందరమైన పులిలావుంది.

ఆ మాటలువిన్న రావుడిమనసు ఒక్కసారిగా అవమానంతో భగ్గున మండిపోయింది. అతని వళ్లు కోపంతో జలదరించింది. 'శీ-శ్శీ! ఈ సుబ్బిగోడు డబ్బెలా గనించేడో నాకు తెల్దనుకుంటన్నావా? ఆడు సేసిన అన్నేయాలు నా కెరుక నేవా? ఆడికీ చాన్దానికీ తేడానేదే! శీ-శ్శీ! నువు నాకు నీతులు సెప్పొచ్చినావా?' అని రావుడు అనుకున్నాడు. 'శా-శ్శా! ఎదవబతుకు నాది. ఈ బతుకు బతుకుతే నేటి, సత్తే నేటి' అని కూడా అనుకున్నాడు.

'ఇయ్యాల్టి చంగతేటిమరి' అని ఆలోచిస్తున్న రావుడికి ఒక వుపాయం తట్టింది.

రావుడు నూకాలమ్మ పండక్కి కోడికోసం కాణీ-అణా అప్పుడప్పుడు కూడబెట్టి చిక్కంసంచీలో దాస్తాడు. ఆ చిక్కంసంచీ వెదురుబద్దలపెట్టెలో దాస్తాడు. ఆడబ్బుల్తో ఆ రోజు గడుపుదావని చిక్కంసంచీ బయటకు తీసాడు. అందులో డబ్బుల్లేవు. రావుడు తెల్లబోయిచూస్తూ నిలబడిపోయాడు.

'మావా. ఏటిసెప్పేది. తాగనానికి నీ కొడుకు ఆ డబ్బులు గుంజుకుపోనాడు' అని కోడలు బెదురుతూ చెప్పింది. వొళ్లుతెలీలేదు. వొళ్లుతెలీని కోపంలో, తాగి వొళ్లు తెలీకుండా గుడి అరుగుమీద పడున్న కొడుకుని చేపాటికర్రితో బాదాడు. 'ఈ ఎసనాలే మన బతుకుల్నిలా సేస్తన్నాయే. ఇయ్యే మన పానాలు తీత్తన్నయ్' అని అరుస్తూ కొడుకుని బాదాడు. అతడు కర్రితో కొడుతున్నప్పుడు బోర్లా పడుకున్న సిమ్మాద్రి ముక్కు నేలకు ఢీకొని నెత్తురు కారింది. నాలిక పళ్ళమధ్యపడి తెగి రక్తం కారింది.

ఆ రక్తబిందువులు ఆ రాతి అరుగుమీద వెంటనే యింకిపోలేదు

రావుడు నీరసంతో కళ్లు చీకట్లుకమ్మి తూలి పడిపోయాడు.

బరువుగా వూపిరిపీలుస్తూ, సిమ్మాద్రి అక్కణ్నుంచి వెళ్ళిపోయాడు. ఆవూరి పక్కనున్న ఏట్లోదిగి మొహం, ముక్కూ, నోరూ కడుక్కున్నాడు. 'ఇంకీ ఎదవ బతుకు బతకను. ఆ సిటంవే వూరొగ్గేసి ఎగేస్తాను' అని అనుకుని, ఆ క్షణమే వూరు విడ్చి వెళ్ళిపోయాడు.

రావుడు కళ్లు విప్పిచూసాడు. సిమ్మాద్రి కనిపించలేదు. రాతి అరుగు మీద యింకిపోని రక్తబిందువులు అతని కళ్ళకు కనిపించాయి. 'నానొట్టి పసివిని. గొడ్డును బాదినట్టు నా కొడుకుని బాదినాను. దరిద్దెరాన్ని కొట్టేక నా కొడుకుని కొట్నాను' అని రావుడు తల్లడిల్లిపోయాడు.

కొడుకు వూరువిడిచి పారిపోయాడని తెల్సుకున్న రావుడు కుప్పలా కూలిపోయాడు.



*    *    *

'నానంటే అందరికీ సులకనై పోనాను. ఇలవనేకుండా పోనాను. మా యమ్మ నన్జూసి సీదరించుకుంటాది. కట్టుకున్నగుంట ఇసుక్కుంటాది. వూళ్లో అందరికీ సులకనైపోనాను. వోరూ నన్ను సిమ్మాదిర్రిఅని పిల్రే. బుడ్డిగోడనే పిలస్తారు. పక్కలో తొంగున్నప్పుడు పెల్లాంకూడా బుడ్డిగోడనే పిలస్తాదికానీ మరోలా పిల్దే. ఓట్లనెక్కల్లో తప్ప మరెక్కడా సిమ్మాదిర్రిపేరు యినబడదు. మాయయ్య గొడ్డునుబాదినట్టు నన్ను బాదినాడే. ఇదంతా తాగడంసేతేగదా సిత్తుగా తాగుతూ 'సిత్తకారితె'కుక్కనై పోనాను. శీ ఛీ- నానింకీ ఎదవబతుకు బతకను. తాగడంసేతే, ఎసనాలల్లే, మాకు కూడూ-గుడ్డా నేవని పెద్దోరంటన్నారు. కస్టపడి పనిసేస్తే మాకు కరువుండదని గొప్పోరంటన్నారు. అందుకే నానింక తాగను, సస్తే తాగను. ఏ ఎసనాలూ తగుల్కోను. కడుపుతోనున్న నా పెల్లాంతోడుగా నానింక తాగను. మా యమ్మతోడుగా వొల్లొంచి పనిసేస్తాను. అలా డబ్బుకూడెట్టి మాకు కరువునేకుండాసేస్తాను'అని సిమ్మాద్రి గట్టిగా ఒట్టు పెట్టుకుని వూరువిడిచి వెళ్ళిపోయాడు.

వూరువిడిచివెళ్లిన సిమ్మాదిర్రి తన వూరికి చాలా దూరంగావున్న పట్నం చేరుకున్నాడు.

ఓ కట్టెలవ్యాపారివద్ద కూలీగా చేరాడు.

అతడు పగలల్లా వొళ్లు దాచుకోకుండా కండలు పిండుకుని పనిచేస్తున్నాడు. అంచాత అతని నరాలు పీకుతూవుండేవి. వొళ్లు నొప్పులుగా వుంటూవుండేది. తాగడం మానీడంవల్ల అతడికి నిద్ర సరిగ్గా పట్టడంలేదు. అంచాత అతని మనసుస్థిమితంగా వుండేదికాదు. రకరకాల ఆలోచన్లు అతని మనసును కలవరపరుస్తూ వుండేవి. తన వాళ్ళందర్నీ చూడాలని తనువు కల్గినప్పుడల్లా తల్లడిల్లిపోతున్నాడు. నిరాశ అతని మనసును కాల్చేస్తోంది.

'నాను బుడ్డిగోణ్ణని సాలామందికి అసియ్యం కానీ, వోరూకూడా నానెందుకలాగయిపోనానో పట్టిచ్చుకోరు. ఆరోరికీ దాన్తో పన్నేదు. మారకతం తాగిందే ఆపద్ర-మా జవ పేర్చేసిందే- బంగారం పండుతాదని ఆసెపడ్డావే- ఆ భూఁవి మాదికాకుండా పోశాదే. మా కష్టం కాట్లొ కల్సిపోనాదే. మా ఆసెలు బుగ్గయిపోనాయే. మావింక ఏటిసూసుకు బతకాల? మా కింకేటిమిగిలింది? అక్కడే నా తమ్ముడు పొంగుట్లో సచ్చిపోనాడే. నానప్పుడు ఎర్రెక్కినట్టయిపోనాను. బుర్రలో సెదట్టినట్టుబాద. గుండెల్లో అగ్గోసినట్టు మంట, నాను బతకాలంటే యియన్నీ మరవాల. అద్గందుకే తాగడం మొదలెట్టినాను. వొల్లు పులుపెక్క నాను తాగనేదే. కానీ ఏది ఏటయిపోనా, నానింక తాగను, సస్తే తాగను'అని అతడు ఆ నిద్రరాని రాత్రిళ్లు తరుచుగా అనుకుంటూవుండేవాడు.

227

అతడలా తాగడం మానేసాడు. కష్టపడి పనిచేస్తున్నాడు. అతడు చాలాచోట్ల పనిచేసాడు. చాలారకాలైన పనులుచేసాడు. రకరకాల యజమానులదగ్గర పన్జేసాడు. అలా పది సంవత్సరాలు గడిచిపోయాయి.

ఏ యిద్దరూ అతడికి సమానంగా కన్పించలేదు కానీ, రెండువిషయాల్లో మానవులంతా సమానమే అని అతడు అప్పుడే తెల్సుకున్నాడు. ఆడాళ్ళవిషయంలో మగాళ్లందరూ ఒకాటే అయినట్లు, పనివాళ్ళ విషయంలో యజమానులంతా ఒకాటే అని తెల్సుకున్నాడు. కష్టపడేవోడికంటే కష్టపడ్నోడే గొప్పోడని అతడికప్పుడే తెల్సొచ్చింది అతడలా చాలా విషయాలు తెల్సుకున్నాడు.

అప్పుడతడు సిమెంటు వ్యాపారివద్ద పనిచేస్తున్నాడు.

ఆ వెన్నెలరాత్రి అతడు రావిచెట్టుకింద సిమెంటు బస్తాఅలాగే బండిమీద వెల్లకిలా పడుకున్నాడు.

చల్లగాలి వొళ్లు పులకరించేలా వీస్తుంది. అతడు పెళ్లానికి దూరంగా వుండడం వల్ల ఆ వెన్నెల్ని కోప్పడ్డాడు. ఆ చల్లగాల్ని తిట్టాడు. ఆకాశంలో దోబూచులాడుతున్న మేఘాల్ని దూషించాడు.

విరిగిపడుతున్న అకాశంలా నిరాశ అతనిమీద కూలిపడింది.

ఆ పక్కింటిగోడమీద చిక్కగా అల్లుకుని పచ్చగావున్న లతలున్నాయ్. ఆ లతల్లో విరబూసిన వెన్నెల నవ్వుల్లాంటి తెల్లని సన్నజాజులున్నాయ్.

సిమ్మాద్రి ఆ సన్నజాజుల్ని పిడికిలితో పీకి కాలికిందవేసి నలిపేసాడు.

'సిమ్మాద్రీ– సిమ్మాద్రీ—'అప్పుడొక పొలికేక. సిమ్మాద్రి తుళ్లిపడ్డాడు. గబగబా బండిఎక్కి మళ్లీ వెల్లకిలా పడుకున్నాడు. అతడు పలకలేదు. కళ్లు విప్పి చూడలేదు.

'ఏయిరా డబ్బు సంచులు? ఎక్కడెట్టినావ్రా? నువు వూరొగ్గేసి పదిపంట్లయిపోనాదే. నువు తాగుడు మానేసినావే. ఒల్లుదాసుకోకుండా పనిసేస్తున్నావే, మరేయిరా నువు పోగేసిన డబ్బు సంచులు?

'డబ్బు సంచులా– డబ్బు సంచులా– ఏటీ ఏటీ– డబ్బు సంచులా? నా సేతులో సిల్లుకానీకూడా నేదే?' అని సిమ్మాద్రి నిరాశగా, దుఃఖంగా, పిచ్చిగా, మొరపెట్టుకున్నాడు.

కాళ్లు కట్టేసి మంటల్లో పడేసిన పక్షిలా సిమ్మాద్రిలోని సిమ్మాద్రి విలవిలా తన్నుకున్నాడు.

అప్పుడే వో ఎలక చల్లగాలికోసం గోడకన్నంలోంచి బయటకు వచ్చింది. ఆ ఎలక యవ్వనంగా బలంగావుంది. ఆ చల్లగాలి వొంటికితగిలేసరికి ఆ ఎలక్కి వొళ్లు పులకరించింది. ఆ చల్లగాల్లో ఆ ఎలక స్వైరవిహారం చేస్తోంది. ఆ ఎలక్కి శత్రువులున్నారని తెలీదు. ఆ ఎలక మురిసిపోతూ స్వేచ్ఛగా తిరుగుతున్నప్పుడు హఠాత్తుగా గోడమీంచి ఒక పిల్లి దూకి, ఆ ఎలకను నోటితో కర్చుకుపోయింది.

ఆ పిల్లి నల్లగా చీకటిపులిలా వుంది.

సిమ్మాద్రి అది చూసాడు. 'ఓ ఎలకముండా ! నీ బతుకూ నా బతుకూ ఒకలాగే వున్నాయే ?'అని ఆ ఎలకమీద జాలిపడ్డాడు.

వెంటనే దిగ్గున లేచి కూర్చున్నాడు. వెనువెంటనే గబుక్కున బండిమీంచి కిందకుదూకి; తిరిగి తనవూరు బయల్దేరాడు.

* * *

ఎండ మండి మండి మళ్లు ముఖంపట్టింది. చెట్ల ఆకులు వాడి వాడి మొహాలు వెలేసాయి. గాలి వీచి వీచి మందగించింది. ఎర్రధూళి ఎగిరి ఎగిరి మరింక ఎగరలేదు.

రావుడు చుట్ట కాల్చి కాల్చి మిగిలిన చుట్టను తలపాగాలో పెట్టాడు.

'నిన్ను పొద్దుటకాణ్నుంచి చైకిలుమీద కూకోబెట్టి తోత్తన్నానే, నన్నోపాలి కూకోనీవా ?' రామారావు ఆడిగాడు

'వీల్లేదు'అన్నాడు గిరిజారావు.

'ఓరి ఎర్రోడా, ఆడునిన్ను చైకిల్మీ కూకోనీడ్రా, ఎందుకురా అణ్నలా బతిమలాడుతావ్. ఏ సెట్టు ఆ సెట్టుకాయలే కాద్దిరా'అని అనుకున్నాడు రావుడుతాత.

రామారావు మనసు విసవిసలాడింది: కొంతసేపు విచారంగా, దీనంగా మామిడిచెట్టుకింద కూర్చున్నాడు. మరికొంతసేపటికి మళ్ళీ సైకిలుతోయడం మొదలెట్టాడు.

ఇంతలో సిమ్మాద్రి ఆత్రుతగావచ్చి. వేపచెట్టుమొదల్ని నడుంఆన్చి కూర్చున్న తండ్రిముందు అసహాయంగా నిలబడ్డాడు.

'ఓరికొడకా, ఒచ్చినావట్రా, నాజ్జేసినతప్పుకి తగిన సిచ్చేసినావులే. ఈముసిలిపేణం రాలిపొయ్యేముందయినా, నిన్జూసే అదుస్టం వుందో నేదో అని గుండె గండడిసస్తన్నాను. ఇయ్యాల్టికేనా ఒచ్చినావు. అదేసాలు ఈ బతుక్కి'అని రావుడు కొడుకుని సందిట్లో పట్టుకున్నాడు.

సిమ్మాద్రి కళ్ళల్లో నీళ్లు గిర్రున తిరిగాయి. అతని గొంతుక బిగుసుకుపోయింది. అతడు ఏమీ మాటాడలేకపోయాడు.

229

తండ్రి వచ్చాడనితెల్సి రామారావు గంతులువేసుకుంటూ వచ్చాడు. పుట్టినప్పట్నుంచీకాకుండా పదేళ్ళకొడుకుని ఒక్కసారే చూసిన సిమ్మాద్రి గుండెల్లో దుఃఖం, ఆనందం, అల్లిబిల్లిగా పెనవేసుకుని అతణ్ని ఏవో తెలీనిభావాల్లో ముంచేసాయి. అతడు కొడుకుని ఎత్తుకుని ముద్దులాడుతూ పరవశంచెందాడు. ఆ కుర్రాడు చాలా సంతోషంగా, ఉత్సాహంగా, బలంగా అప్పుడు కనిపించాడు.

సిమ్మాద్రి మొహంలో సంతోషం వెన్నెల్లావిరిసింది.

ఇంతలో సిమ్మాద్రితల్లి సత్తుగిన్నెలో గెంజోసి పట్టుకొచ్చింది. 'ఈ సేతుల్తో నీకు గెంజోసి పదిపంట్లయి పోనాదిరోరికొడకా! ఇదంతా మీ యయ్యే సేసినాదోరికొడకా!'అని ఆమె అంటూ కొడుకుని చుట్టేసింది.

సిమ్మాద్రి ఆమెను కౌగిట్లోకి తీసుకున్నాడు. అతడి కన్నీళ్ల ఆమె తలమీద రాలాయి.

'ఇన్నాళ్ళకి మాం గురుతొచ్చినామన్నమాట' అని సిమ్మాద్రి పెళ్లాం తలదించుకుని, అడిగింది. ఆమె కొత్త పెళ్లికూతుర్లా అప్పుడు సిమ్మాద్రికి కనిపించింది. ఆమె అత్తను తీసుకుని తిరిగి యింటికి వెళ్లిపోయింది. వెళిపోతూ, వెళిపోతూ ఆమె సిమ్మాద్రి మొహంలోకి చూస్తూ చూస్తూ ముసిముసినవ్వులు నవ్వింది.

ఆ నవ్వులు అతడి గుండెల్ని కవ్వించాయి.

తమ్ముళ్లూ-చెల్లెళ్లూ అతణ్ని చుట్టుముట్టేసారు. వూరువూరంతా అతడి చుట్టూ చేరింది.

రామారావు మళ్లీ తోట్లోకిపోయి గిరిజారావు కూర్చున్న సైకిలు తోస్తున్నాడు.

సిమ్మాద్రి తనచుట్టూ చేరినవాళ్ళతో తను వూరువిడిచి వెళ్ళిననాటినుండీ జరిగిన సంగతులన్నీ చెప్తున్నాడు అలా చెప్తూ సైకిలు తోస్తున్న కొడుకుని చూస్తున్నాడు.

అంతలో గిరిజారావు సైకిలుదిగి మేడమీదకు పరుగెత్తాడు.

రామారావు మామిడిచెట్టుకింద కాళ్లుచాచుకూర్చున్నాడు.

అప్పుడు రామారావుకి చాలా ఆకలిగా వుంది. అతడు సైకిలు తోయడంవల్ల బాగా అల్సిపోయాడు. ఆయేల ఆల్లింట్లొ కూడ్నేదు. అంచేత అళ్ళమ్మ ఆడికికూడెట్నదు. కూసిన్ని గెంజినీల్లోసి తగిలేసింది. అంచాత అతడు చాలా ఆకలిగావున్నాడు. (బాగా అల్సిపోనాడు.) ఆకలి కిరకిర్లాడుతోంది. ఆ ఆకలి బాధకంటే 'అల బొద్దెల్నుంచీ అణ్ని చైకిల్మీకూకోబెట్టి తోత్తన్నా, నన్నోపాలి కూకోనిచ్చినాడు కాదే' అనే బాధ అతడికి మరీ బాధగా వుంది.

230

ఇంతలో గిరిజారావు పెండికంచంలో పనసతొనలు తెచ్చుకుని రామారావుముందు నిలబడి తింటున్నాడు. ఆ వెండికంచం గుండ్రంగా పున్నమచంద్రుడి ముఖంలావుంది. ఆ పనస తొనలు గుమ్మని వాసనవేస్తూ నోరూరిస్తున్నాయి. అవి పసుపు పచ్చగా, బంగారంవన్నెలా, (బింకంగా, రసవంతంగా) వున్నాయి. అవి ఆ పచ్చని సూర్య కాంతిలో మరీ పచ్చగా మెరుస్తున్నాయి.

అవి చూసి రామారావుకి నోరూరింది. 'నాకో తొనెట్టవా'అని అడిగాడు. వీల్లే దన్నాడు గిరిజారావు. 'అలబొద్దేల్నుంచి నిన్ను చైకిల్మీకూకోబెట్టి తోత్తన్నా నన్నో పాలి కూకోనిచ్చినావు కావే! పోన్లే, ఒక తొనేనాఎట్టు, ఒక తొనెడితే అరిగిపోతా వేటి? ఎట్టు, ఎట్టు' అని చెయిచాచి కొంచెం గిరిజారావు దగ్గరగా వెళ్లాడు.

వీల్లేదని గిరిజారావు గట్టిగా అరిచాడు 'ఎందుకీల్లేదూ?'అని రామారావు మరి కొంచెం దగ్గరగావెళ్ళి మరికొంచెం గట్టిగా అడిగాడు.

'వీల్లేదు, వీల్లేదు. వీల్లేదంటే వీల్లేదు. మా తాతను పిలుస్తాను. మా కుక్కను వుసికొల్పుతాను, నీ పొగరేంటో చూస్తాను. అని గిరిజారావు గొంతుక పెద్దదిచేసి అరిచి, చీదరించుకుంటూ నేలమీద వుమ్మాడు.

'నీకు నేయం నేదులే, అలబొద్దుకాణ్నుంచి నినుగూకోబెట్టి చైకిలుతోత్తన్నానే, నన్నోపాలైన కూకోనిచ్చునావుకాదే. ఒక తొనెట్టమన్నా ఎట్టినావు కాదే. నా నొట్టినే ఎట్టమన్నేదే, చైకిలు తోసినానుగందా అని ఎట్టమన్నాను. నే దండానికి నీకు సిగ్గవ నేదా? సెప్పుకో, సెప్పుకో. నీ దిక్కున్నసోట సెప్పుకో, ఓరూ నన్నద్నేరు. సూసుకో!'అంటూ రామారావు కోడిపిల్లను గెద్దంకించుకున్నట్లు, ఆ తొనల్ని అంకించు కున్నాడు.

గిరిజారావు అడ్డువస్తే కిందకు తోసేసాడు. ఆ తొనలు తింటూ వెనక్కి తిరిగి పోయాడు.

సిమ్మాద్రికాకుండా, రావుడుతాతకూడా ఆ జరిగిందంతా చూసాడు. అక్కడ చేరినవాళ్ళందరూ చూసారు.

అప్పుడు రావుడితాతకు మనవడిమీద పట్టరానికోపం వచ్చింది.

'ఓరిగుంటడా! ఓరి గాడిదకొడకా! ఏట్రా నువుసేసినావు? ఏట్రా ఆ దగు ల్బాజీపని? కూడ్నేకపోతే, నువు ఆకల్తోసావు. నువుసస్తే ఈ నోకానికేటీ నోటురాదు. కానీ నీతి సావకూడదురా, ఏట్రా నీ పొగరు! నీతిమాలినపని సేస్తావట్రా! సూడు, ఇయ్యాల నీ దుమ్ములొల్సెస్తాను'అంటూ రావుడు చేతికర్రతీసి వస్తున్న మనవడికి ఎదు రుగా వెళ్లాడు.

231

'ఓరి ముసిల్నంజాకొడకా, నా దుమ్ములొలుత్తావట్రా? నానేం తప్పుసేసినాన్రా? నానేం తప్పుసేయ్‌నేదురా, ఆ తప్పంతా ఆమెకంగోడు ఆడిదేరా. నాన్జేసింది నీ కంటికి అగపడ్డదా? ఆడుసేసింది నీకంటికి అన్నేదా? గుడ్డినంజాకొడకా, రారా, కొట్రా' అంటూ రామారావు తాతచేతిలోనికర్ర ఎగిరిపట్టుకుని గట్టిగా లాగాడు.

రావుడుతాత కర్ర వదలకపోయినా కుదుపుకి తూలి పడిపోయాడు. వొళ్లుతెలీని కోపంతో కర్రనానుకునిలేచి, మనవణ్ని కొట్టడానికి మళ్ళీ కర్రపైకెత్తాడు.

'ఓరయ్యా, ఓరోరయ్యా, ఆగరా, ఆగరా, ఒల్లకోరా, ఒల్లకోరా, నీకు ఆకలిబాదేగాని అన్నేయాల బాద తెల్నేదురా. నీకు కడుపుమంటేగానీ, గుండె మంట తెల్దురా. నీ మనవడు నీలా బతకనేడ్రా' అంటూ సిమ్మాద్రి తండ్రిని అడ్డుకున్నాడు.

తెలతెలబోతూ రావుడుతాత వెలవెలబోతున్న ఆకాశంలోకి వెర్రిగా చూసాడు.

అక్కడ చేరినవాళ్ళందరూ ఒకరిమొహాలొకరు చూసుకున్నారు.

మనవడి ఏడ్పువిని సుబ్బారావు గబగబామెట్లుదిగి కిందకువచ్చాడు. జరిగిందంతా మనవడిద్వారా తెల్సుకున్నాడు.

'ఎవడ్రావాడు, నా మనవడి పనసతొనలు ఎత్తుకుపోయాడు? ఎవడ్రా వాడు నా మనవణ్ని కొట్టాడు. ఎవడ్రా వాడు నా మనవణ్ణి కిందకు తోసేసాడు. నా మనవడి ఒంటిమీద చెయివేయడానికి వాడికి ఎన్నివేల గుండెలున్నాయిరా? వాణ్ని ముక్కలు ముక్కలు కింద తరిగించేసి, గెద్దలకు ఎగరేయిస్తా' అంటూ సుబ్బారావు గావు కేకలు పెట్టాడు.

సుబ్బారావలా కేకలు వేసివేసి అప్పటికి వూరుకున్నాడు.

---

## చైనాపై అరుణతార – మేడేకు విడుదల

విద్యుచ్ఛక్తిలో కోతవల్ల ప్రెస్‌లో తరచు కరెంటు ఫేలయి "చైనాపై అరుణతార" పుస్తకం లోగా ప్రకటించినట్లుగా మార్చ్ నెలాఖరుకు అందించ లేకపోయినందుకు మన్నించాలి. మేడే కానుకగా అందించగలం.

జనత ప్రచురణలు
6-3-628/13 ఖైరతాబాదు,
హైదరాబాదు 500004.

232